క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని రంగాపురం సచివాలయం జిలాని సర్కిల్లో నేడు జగనన్న సురక్ష కార్యక్రమం మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో అర్జీలిచ్చిన వారు వాటిని పొందవచ్చునని అందులో పేర్కొన్నారు. అదేవిధంగా ఇదే కార్యక్రమం నేడు కొలమాసనపల్లి పంచాయతీ కల్లాడు సచివాలయం వద్ద నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యాసామర్థ్యాల పరిశీలన



సామర్థ్యాలను తెలుసుకుంటున్న ఎంఈఓ

పలమనేరు: పట్టణంలోని కొత్తపేట ఉర్దూ స్కూల్‌లో బుధవారం ఎంఈఓ లీలారాణి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, విద్యాకానుకలు, స్మార్ట్‌టీవీ, మధ్యాహ్న భోజన అమలును ఆమె తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు తగిన సూచనలిచ్చారు.

వైద్యసిబ్బందికి సన్మానం



సదుం: సిబ్బందిని సన్మానిస్తున్న నాయకులు

సదుం: స్థానిక సీహెచ్‌సీ నుంచి ఇటవల బదిలీ అయిన వైద్య సిబ్బందిని ఆస్పత్రిలో బుధవారం సన్మానించారు. డాక్టర్లు శ్రీధర్‌బాబు, శిరీష, అజితతో పాటు ఎఫ్‌ఎన్‌ఓ చంద్రమ్మ బదిలీ అయ్యారు. వీరు ఉత్తమ సేవలు అందించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి కొనియాడారు. అలాగే బదిలీపై నూతనంగా వచ్చిన డాక్టర్లు పుష్పాకుమారి, స్వర్ణలత, అనురాధ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ హనుమంతరెడ్డి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటస్వామి, నేతలు సురేంద్రరెడ్డి, మురళి, రమాదేవి పాల్గొన్నారు.

మెరుగైన సేవలకు కృషి



108 ప్రారంభిస్తున్న నేతలు, సిబ్బంది

సదుం: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం కృషిచేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం మండలానికి కొత్తగా కేటాయించిన 108 వాహనాన్ని బుధవారం పూజలు చేసి, ఆయన ప్రారంభించారు. ఎస్‌ఐ మారుతి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ మనోజ్‌కుమార్ రెడ్డి, రంగనాథ్, శివప్రసాద్, వెంకటరమణ, చంద్రశేఖర్, వైద్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బైరెడ్డిపల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. మొట్లపల్లె, ధర్మపురి గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. హెల్త్‌ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, సిబ్బంది లక్ష్మీప్రసన్న, ప్రశాంతి, జమున, నాగభూషణమ్మ పాల్గొన్నారు.

బీజేపీ నేత మృతి

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గ బీజేపీ సీనియర్ నేత గణేష్(60) బుధవారం మృతి చెందాడు. కొంతకాలంగా ఈయన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పలువురు బీజేపీ నేతలు, పట్టణ ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించి, కుటుంబసభ్యులకు తమ సంతాపం తెలియజేశారు.

సారా విక్రేతకు రిమాండ్

చౌడేపల్లె: దిగువపల్లె పంచాయతీ పక్షిరాజపురానికి చెందిన ఎస్.సాగర్‌ను సారా కేసులో అరెస్ట్ చేసి పుంగనూరు కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించారని ఎస్‌ఐ రవికుమార్ బుధవారం తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గతనెల 30న బోయకొండ సమీపంలో సాగర్ సారాను విక్రయిస్తూ పట్టుబడ్డారు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అవినీతి నిర్మూలన సంస్థ యూత్ అధ్యక్షుడి నియామకం

పలమనేరు: పట్టణానికి చెందిన మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా బైరెడ్డిపల్లి మండలానికి చెందిన సోమును నియమించినట్టు ఆ సంఘ అధ్యక్షుడు మునిరత్నం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానికంగా ఎవరికైనా అన్యాయం జరిగితే తమ సంస్థ వారికి అండగా నిలిచి న్యాయం కోసం కృషిచేస్తుందని అందులో పేర్కొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు



ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్



ఎన్‌ఎస్‌పేటలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా

- ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. బుధవారం మణీంద్రం సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష క్యాంపులో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఈ క్యాంపులో ఉచితంగా అందిస్తోందన్నారు. సచివాలయాల ద్వారా అన్ని ధ్రువీకరణ పత్రాలు గ్రామ స్థాయిలో, త్వరితగతిన అందుతున్నాయని చెప్పారు. శిబిరంలో 191 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు చిన్నారెడ్డి, పురుషోత్తం, ఎంపీడీఓ రాధాకృష్ణ, తహసీల్దార్ మురళి, ఎంపీపీ సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సర్పంచు ఉషారాణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

పుంగనూరు: సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ఎన్‌ఎస్.పేటలోని 10వ సచివాలయ పరిధిలో కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని అందరి సమస్యలను గుర్తించి పరిష్కరించే కార్యక్రమం ఈనెలాఖరులోపు పూర్తి చేసి, ఆదర్శంగా నిలుస్తామని ఆయన స్పష్టం చేశారు. కౌన్సిలర్లు భారతి, రాఘవేంద్ర, కన్వీనర్ వరదారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు ఆవుల అమరేంద్ర, ఎంఎం.సాధిక్, సలామత్, ఎంఎం.ఆనంద, రమణ, ఖాన్ పాల్గొన్నారు.

పేదల కోసమే జగనన్న సురక్ష

రొంపిచెర్ల: పేదల అభ్యున్నతి కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి అన్నారు. గానుగచింత గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఎంపీడీఓ రాజేంద్ర, తహసీల్దార్ అమర్‌నాథ్, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచ్ జీవలత, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: మండలంలోని కలకటవారిపల్లెలో జగనన్న సురక్ష శిబిరం బుధవారం నిర్వహించారు. 162 మంది లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లను ఎంపీపీ ఎల్లప్ప, అధికారులు అందజేశారు. స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణ, ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ చంద్రశేఖర్, సర్పంచ్ ఐశ్వర్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): అయ్యావాండ్లపల్లె పంచాయతీ పెద్ద బెస్తపల్లెలో జగనన్న సురక్షపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సమస్యలుంటే తెలియజేయాలని వాటిని వెంటనే పరిష్కరిస్తామని వెంకట దాసరపల్లె ఎంపీటీసీ పోకల చంద్ర తెలిపారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

పెద్దపంజాణి: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయని ఎంపీపీ ఎస్. రెడ్డెప్ప, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి చెప్పారు. అమ్మరాజుపల్లిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వారు హాజరై ప్రారంభించారు. అనంతరం 598 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుష్మకీర్తి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి గోవర్ధన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్, తహసీల్దార్ లోకేశ్వరరావు, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ స్వర్ణలత, నేతలు అమరనాథరెడ్డి పాల్గొన్నారు.



సోమల: సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ

సురక్షను సద్వినియోగం చేసుకోండి

వి.కోట: జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ యువరాజు సూచించారు. చింతమాకులపల్లి సచివాలయం వద్ద జగనన్న సురక్ష పథకం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎంఆర్‌ఓ చిట్టిబాబు, ఈఓఆర్‌డీ నరేష్, సర్పంచ్ రామచంద్రప్ప, సచివాలయ కన్వీనర్లు రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

106 మందికి ధ్రువీకరణ పత్రాలు

చౌడేపల్లె: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం చౌడేపల్లె-1 సచివాలయం వద్ద నిర్వహించారు. అక్కడికక్కడే 106 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేసినట్లు స్పెషలాఫీసర్ ప్రసాద్ తెలిపారు. ఎంపీపీ రామమూర్తి, సర్పంచ్ వరుణ్ భరత్, సచివాలయ కన్వీనర్ రుక్మిణమ్మ, ఎంపీటీసీ రూపారేఖ, ఉపసర్పంచ్ అల్తాఫ్ ఎంపీడీఓ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ రావు పాల్గొన్నారు.

464 ధ్రువీకరణ పత్రాలు పంపిణీ

సోమల: అన్నెమ్మగారిపల్లెలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 464 మందికి ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజ, ఈఓపీఆర్డీ సుధాకర్ కుమార్, వైస్ ఎంపీపీలు సయ్యద్ బాషా, ప్రభాకర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంగాధరం, సర్పంచ్ వనజమ్మ, ఎంపీటీసీ సర్వేశ్వరమ్మ పాల్గొన్నారు.



చౌడేపల్లెలో ధ్రువీకరణపత్రాలను అందజేస్తున్న స్పెషలాఫీసర్, ఎంపీపీ



మోటుమల్లెలో సర్టిఫికెట్లను ఇస్తున్న రెడ్డీశ్వర్‌రెడ్డి



సదుం: సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎల్లప్ప



పెద్దబెస్తపల్లెలో మాట్లాడుతున్న పోకల చంద్ర



అమ్మరాజుపల్లిలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న నేతలు, అధికారులు



వి.కోట: మాట్లాడుతున్న ఎంపీపీ

నేడు కొలమడుగులో గడప గడపకు..

శాంతిపురం: ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో నేడు, రేపు కొలమడుగు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి రెడ్లపల్లి, చిల్లిమానిపల్లి, జీడిమానిపల్లి, కదిరిముత్తనపల్లిల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. శుక్రవారం కొలమడుగు, వి.కొత్తూరు, ఒడ్డుమడి, తోపుచేను, రామాపురం, అమ్మవారిపేట గ్రామాల్లో ఎమ్మెల్సీ పర్యటిస్తారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొనాలని కోరారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఎంపీటీసీ

చౌడేపల్లె: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలకు పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ శ్రీరాములు సూచించారు. బుధవారం గడ్డంవారిపల్లెలోగల కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లల హాజరును పరిశీలించారు. అనంతరం పౌష్టికాహారం కిట్లను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త పాపులమ్మ పాల్గొన్నారు.

ఘనంగా గంగజాతర



విశేషాలంకరణలో గ్రామదేవత

చౌడేపల్లె: మండలంలోని పెద్ద కొండామర్రిలో బుధవారం ఘనంగా గంగ జాతర నిర్వహించారు. గ్రామదేవత నడివీధి గంగమ్మ, కుంటి గంగమ్మ, బోయ కొండ గంగమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో వేకువజామునే దీవెలు తీసుకెళ్లి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. వర్షాలు భాగా కురవాలని, పంటలు భాగా పండాలని, జంతు, సంపద వృద్ధిచెందాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండేలా కరుణించాలంటూ పూజలు చేశారు. బంధుమిత్రులతో గ్రామంలో సందడి నెలకొంది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: నియోజకవర్గంలోని నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అందిన రూ.4.10లక్షల చెక్కులను స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ బుధవారం ఆయా మండలాల నాయకుల సమక్షంలో పలమనేరులో పంపిణీ చేశారు. లబ్ధి పొందిన వారిలో శిల్ప, బాలక్రిష్ణ ఉన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటేగౌడలకు కృతజ్ఞతలు తెలిపారు.

బైరెడ్డిపల్లె మండలంలో..

బైరెడ్డిపల్లి: మండలంలోని ఆకులకొత్తూరు గ్రామానికి చెందిన పద్మనాభరెడ్డి కుమారుడు హేమగిరి రెడ్డి ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డాడు. ఇతనికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద అతనికి రూ.3 లక్షలు మంజూరైంది. బుధవారం హేమగిరిరెడ్డి తల్లి అమరమ్మకు రాజంపేట ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి చెక్కును అందజేశారు. సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ భాస్కర్‌మొదలి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కార్తిక్, నేతలు శంకర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



చెక్కును పంపిణీ చేస్తున్న నేతలు



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం మండలంలో..

గంగవరం: మండలంలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రెండు చెక్కులను ఎమ్మెల్యే వెంకటేగౌడ బుధువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నల్లసానిపల్లి గ్రామానికి చెందిన గోవిందుమధుకి రూ.60వేలు, ఇదే గ్రామానికి చెందిన మంగమ్మకు రూ. 2లక్షలు మంజూరైంది. బుధవారం చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.

హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎంను సన్మానిస్తున్న నేతలు

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన కె.ఆనందమ్మ లింగాపురం ఎంపీపీ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా బుధవారం రాజుపల్లి పాఠశాలలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. సర్పంచ్ నర్మద, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, నేతలు శంకర్‌రెడ్డి, క్రిష్ణప్ప, పీఎంసీ చైర్మన్ నగేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే కురబలకు మేలు

పలమనేరు: ముప్పై సంవత్సరాల తర్వాత కురబ కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి స్థానాన్ని కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని అందుకే ఆయన్ను ఢిల్లీలో కలిసి కృతజ్ఞతలు తెలిపినట్టు ఏపీ కురబ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జబ్బుల శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన సందర్భంగా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆర్ క్రిష్ణయ్యలతో కలిసి సీఎంతో మాట్లాడినట్టు అందులో పేర్కొన్నారు.

వేడుకగా అర్జున తపస్మాన్





విగ్రహాలను తీసుకొస్తున్న వేణుగోపాల్‌రెడ్డి, తపస్మాన్ అధిరోహిస్తున్న అర్జున పాత్రధారి

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతంమిట్ట వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం అర్జున తపస్మాన్ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఈఘట్టాన్ని అందరినీ అలరించేలా నాటక రూపంలో ప్రదర్శించారు. అర్జున పాత్రధారి తనతో పాటు జోలెతో తపస్మాన్ అధిరోహిస్తూ రాగయుక్తంగా పద్యాలను ఆలపించాడు. అతను విసిరే నిమ్మకాయల కోసం భక్తులు ఎగబడ్డారు. అంతకుమునుపు పాండవుల ఆలయం వద్ద విగ్రహాలకు కంకణదారి పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి పూజలు చేసి వాటిని తపస్మాన్ వద్దకు తీసుకువచ్చారు. ఎంపీపీ ఎల్లప్ప, పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, నాగభూషణంరెడ్డి, మల్‌రెడ్డి, ప్రకాష్ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలపై ఆరా తీస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: సమస్యల పరిష్కారానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో కృషిచేస్తున్నట్లు ఎంపీపీ ఈశ్వరయ్య, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర రావు అన్నారు. బుధవారం మండలంలోని పాలికిమాకులపల్లెలో పర్యటించారు. గ్రామంలో సమస్యలపై ఆరా తీశారు. దృష్టికి వచ్చిన డ్రైనేజీ, దారి, హౌసింగ్ సమస్యలను అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంగాధరం, ఎంపీడీఓ నాగరాజ పాల్గొన్నారు.

వరసిద్ధునికి వెయ్యేళ్ల చరిత్ర

రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కాణిపాక ఆలయం ఒకటి. స్వయంభుగా వెలిసిన వరసిద్ధి వినాయకస్వామి సత్యప్రమాణాల దేవుడిగా ఆదరణ పొందారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారు స్వామిగా భక్తులు కొలుస్తారు. స్వామివారి దర్శనార్థం తరలివచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలోనే వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని దాత సహకారంతో అద్భుతంగా పునర్నిర్మించారు. స్వయంభుగా వెలిసిన మూలమూర్తి క్రమంగా పెరుగుతుండడంతో మరో విశేషం.

- తిరుమల తరహాలో కాణిపాక ఆలయం
- రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీ
- రూ.50 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు



కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం



మూలమూర్తికి తొడిగిన వెండి కవచాలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి జిల్లాలోని ఐరాల మండలం కాణిపాకంలో బాహుదా నది ఒడ్డున స్వయంభుగా వెలసి భక్తులకు దర్శనమిస్తున్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ రాష్ట్రాల నుంచి నిత్యం వేల సంఖ్యలో స్వామిని దర్శించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం గత సంవత్సరం రూ.11 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. గత సంవత్సరం ఆగస్టు 21న ఆలయ మహాకుంభాభిషేకం నిర్వహించారు. అప్పటి నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు రోజూ 20 వేలకు పైగా వస్తున్నారు.

రెండో తిరుమలగా..

కాణిపాక వినాయక స్వామి ఆలయం రెండో తిరుమలగా పేరు ప్రఖ్యాతులు సంతరించుకుంది. తిరుమలకు వస్తున్న అన్ని రాష్ట్రాల భక్తులు కాణిపాకం దర్శించుకోవడం ఆనవాయితీగా మారుతోంది. ఇక్కడ దర్శన ఏర్పాట్లు, అన్నదానం క్రమక్రమంగా తిరుమల తరహాలో రూపుదిద్దుకుంటున్నాయి.

క్రమేణా పెరుగుతున్న మూలమూర్తి

బావిలో ఉద్భవించిన వినాయకుడి విగ్రహం క్రమేణా నిత్యం పెరుగుతూ ఉండడం విశేషం. చోళరాజుల కాలంలో కాణిపాక ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని పరిపాలిస్తున్న కుళతంగ చోళుడనే రాజు 11వ శతాబ్దంలో ఇక్కడ ఆలయాన్ని నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయి. 65 ఏళ్ల క్రితం బహూకరించిన వెండికవచం, 2000, 2002, 2006, 2007లో భక్తులు ఇచ్చిన తొడుగులు స్వామికి ఇప్పుడు సరిపోక పోవడం ఇందుకు నిదర్శనంగా చెబుతారు. ఈ కవచాలను భక్తుల దర్శనార్థం ఆలయంలో ప్రత్యేకించి అలంకరించి ఉన్నారు.

సత్యప్రమాణాల దేవుడిగా..

వరసిద్ధి వినాయక స్వామివారి ఎదుట తప్పుడు ప్రమాణాలు చేసిన శిక్షపడుతుందని ఇక్కడికి వచ్చే భక్తుల ప్రగాఢ విశ్వాసం. వ్యసనాలకు, బానిసలైన వారు స్వామి ఎదుట ప్రమాణం చేస్తే వాటికి దూరం అవుతారని నమ్మకం. ఇక్కడ రాజకీయ నాయకులు సైతం ప్రమాణాలు చేయిస్తుండడం విశేషం. ఇక్కడ ప్రమాణం చేస్తే అలాంటి విషయాలను సైతం కోర్టుల్లో న్యాయమూర్తులు అంగీకరించే వారని పెద్దలు చెప్పేవారు.

రూ.50 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు

భక్తులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో ఆలయ అభివృద్ధి పనులు రూ.50 కోట్లతో చేపట్టారు. స్వామివారి భక్తులకు నిత్య అన్నదానం గతంలో 2 నుంచి 3 వేల మందికి పంపిణీ చేసేవారు. ప్రస్తుతం రోజూ 7 వేల నుంచి 8 వేల మంది భక్తులకు అందించాలని నూతన భవనంలోకి మార్పు చేస్తున్నారు. నూతనంగా వంద గదులపైన నూతన గదులు, కల్యాణ మండపాలు నిర్మిస్తున్నారు. భక్తులు స్వామివారి ఆలయం వద్దకు రావడానికి వంద అడుగులు రహదారి ఏర్పాటు చేశారు. రహదారి పక్కన ఆహ్లాదకరంగా ఉండేందుకు పార్కులు ఏర్పాటు చేస్తున్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



పంట నమోదును పరిశీలిస్తున్న ప్రసాద్‌రావు

సత్యవేడు: ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, దీనివల్ల రైతులకు చాలా ఉపయోగం కలుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు అన్నారు. బుధవారం సాయంత్రం వెంకటరాజుల కండ్రిగలో పత్తి పంటను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ 2023లో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. తద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ, పంట బీమా, అన్ని రకాల ప్రభుత్వం సేవలు అందుతాయన్నారు. అనంతరం రైతులకు చీడ పీడల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రడ్డి, ఏడీఏ సుబ్రమణ్యం, ఏఓ మురళి, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ,రైతులు పాల్గొన్నారు.